**విలేఖరులు కావలెను**

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి: 03 సంచిక : 53 సోమవారం, మే 27, 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8



## ఆర్వో సీల్‌లేని పోస్టల్ బ్యాలెట్లపై స్పష్టత ఇచ్చిన ఈసీ




రిటర్నింగ్ అధికారి సీల్ (ముద్ర) లేని పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటు విషయంలో నెలకొన్న అనిశ్చితిపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. ఆర్వో సీల్ లేకపోయినప్పటికీ పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించవద్దని ఈసీ నిర్దేశించింది. ఆర్వో సీల్ లేకపోయినా... ఆర్వో సంతకం ఉంటే ఆ పోస్టల్ బ్యాలెట్లు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అయితే, ఫారం-13ఏ లో అన్ని వివరాలతో పాటు ఆర్వో సంతకం కూడా ఉండాలి... అప్పుడే చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. ఒకవేళ ఫారం-13ఏ లో ఓటరు సంతకం, ఆర్వో సంతకం, బ్యాలెట్ సీరియల్ నెంబరు లేకపోతే ఆ పోస్టల్ బ్యాలెట్ ను తిరస్కరించవచ్చు అని ఈసీ వివరించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో ఈసీ జారీ చేసిన తాజా మార్గదర్శకాలను ఏపీ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా జిల్లాల రిటర్నింగ్ అధికారులకు పంపించారు.

## మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు దేశం నిర్ణయించింది: ప్రధాని మోదీ


జూన్ 4న మరోసారి మోదీ సర్కారు కొలువుదీరడం ఖాయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఇప్పటికే ముగిసిన ఆరు దశల ఎన్నికల పోలింగ్‌లో దేశం ఈ మేరకు నిర్ణయించిందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ-ఎన్డీయే కూటమి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. సదుద్దేశాలు, విధానాల కారణంగా బీజేపీ-ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని మూడోసారి ఏర్పాటు చేయాలని దేశం నిర్ణయించుకుందని ఆయన వ్యాఖ్యానించారు ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఇండియా కూటమి మతపం ౼మైనదిగా, కులపరమైనదిగా దేశం అర్థం చేసుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు గానూ రాజ్యాంగాన్ని మార్చాలని వారు నిర్ణయించుకున్నారని మోదీ ఆరోపించారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు ఉంటా రని, అలాంటి ప్రధానులు దేశాన్ని బలోపే తం చేయగలరా అని ప్రధాని ప్రశ్నించారు. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఓటు బ్యాంకుకే పరిమితమయ్యారని, అయితే మోదీ మాత్రం దేశంలోని పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అంకితం అయ్యారని పేర్కొన్నారు.



# 13 నిమిషాలు యథాతథం

### జయజయహే తెలంగాణ గీతంపై సీఎం రేవంత్ నిర్ణయం

### బాణీలు, సంగీత కూర్పుపై అందెశ్రీ, కీరవాణిలతో చర్చ



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రముఖకవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగా ణ' ను యథాతథంగా ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. 13 నిమిషాల నిడివి గల ఆ పాట సాహిత్యం, ప్రతి చరణం అలాగే కొనసాగించాలని స్పష్టం చేశారు. 'జయజయహే తెలంగాణ గేయానికి బాణీలు, సంగీతకూర్పుపై ఆదివారం ఓ స్టూడియోలో గేయ రచయిత అందెశ్రీ, సంగీత ద ర్శకుడు కీరవాణి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్య ప్రజా సంబంధాల అధికారి బోరెడ్డి అయోధ్యరెడ్డిలతో రేవంత్ సమావేశమయ్యారు. ఈ భేటీలో అందెశ్రీ, కీరవాణిలకు ఆయ న పలు సూచనలు చేశారు. వాటికి అనుగుణంగా మార్పుల అనంతరం మరోమారు సమావేశమై గేయానికి తుది రూపం ఇవ్వాలని నిర్ణయించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై 13 నిమిషాలు గేయం ఆలపించడం అతిథులకు ఇబ్బంది కలిగిస్తుందేమో ననే అభిప్రాయంతో షార్ట్ వర్షన్ రూపొందించాలనే అభిప్రాయం చర్చకు వచ్చిందని, ఈ షార్ట్ వర్షన్ బాధ్యత అందెశ్రీకి అప్పగించారని తెలుస్తోంది.

# ఆ విమర్శల్లో నయాపైసా నిజం లేదు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**విపక్షాల విమర్శలకు ఉత్తమ్ కుమార్ కౌంటర్**

**మహేశ్వర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు కట్టిపెట్టాలని హితవు**

**ఢిల్లీకి డబ్బులు పంపించే సంస్కృతి బీజేపీదేనని విమర్శలు**

తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విపక్షాలపై ధ్వజమెత్తారు. హైదరాబాదు గాంధీ భవన్ లో ఆయన మీడి యాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు చేస్తున్న విమర్శల్లో నయాపైసా నిజం లేదని అన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ, అవే నిజమని నమ్మించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, బాధ్యత లేకుండా ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పౌరసరఫరాల విభాగం రూ.58 వేల కోట్లు అప్పులు చేసిందని, అందులో రూ.11 వేల కోట్ల మేర



నష్టాలేనని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ గత పాలకులు రూ.20 కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్దే వదిలేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తాము ఈసారి ముందుగానే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని, రైతులకు చెల్లింపులు కూడా వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరిగింది రూ.200 కోట్లేనని, అలాంటిది రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారని ఉత్తమ్ మండిపడ్డారు. నేను ఉత్తమ్ కుమార్ రెడ్డిని... నాపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్ర ంలో తాను యూ ట్యాక్స్ వసూలు చేస్తున్నానంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి అంటున్నారని ఉత్తమ్ కుమార్ మండిపడ్డారు. వినతిపత్రాలు ఇవ్వాలంటూ సీఎం అపాయింట్ మెంట్ తీసుకుని, తీరా సీఎం చాంబర్లోకి వెళ్లాక ల్యాండ్ సెటిల్మెంట్ గురించి మాట్లాడింది ఎవరని ఎద్దేవా చేశారు. తాను వెయ్యి కోట్లు తీసుకున్నట్టు ఆరోపిస్తు న్నారని, బీజేపీ శాసనసభాపక్ష పదవి కోసం ఆయనే ఢిల్లీకి డబ్బులు పంపారేమో అంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీకి డబ్బులు పంపే సంస్కృతి బీజేపీకే ఉందని, ఇకనైనా మహేశ్వర్ రెడ్డి నీచపు మాటలు మానుకోవాలని హితవు పలికారు.

# తీరం దాటిన రెమాల్

### అర్ధరాత్రి తరువాత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య..

### బెంగాల్‌లో అత్యంత భారీ వర్షాలు.. పలు విమాన, రైలు సర్వీసులు రద్దు

### ఏపీలో పొడి వాతావరణం.. 2 నుంచి 4 డిగ్రీలు పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం: తీవ్ర తుపానుగా బలుపడిన రెమాల్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటింది. అంతకుముందు తీవ్ర తుపాను గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఉత్తర బంగాళాఖాతం నుంచి తీరం వైపు పయనించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు విపత్తు నిర్వహణ కోసం భారీ ఎత్తున ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలకు ఉపక్రమించాయి. తుపాన్ ప్రభావం మన రాష్ట్రంపై అంతగా లేకపోయినా.. దీని కారణంగా రాష్ట్రంలో తేమ మొత్తం పోయింది. పొడి వాతావరణం ఏర్పడింది. దీనికితోడు ఏపీ, యానాంలో పశ్చిమదిశగా గాలులు వీస్తుండటంతో ఉక్కపోత మరింత ఎక్కువ కానుంది. రాబోయే రెండురోజులు కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం ఏర్పడుతుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రెండురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వెల్లడించారు.



మరోవైపు నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించాయి. నైరుతి ఈ నెల 31 నాటికి కేరళలోకి ప్రవేశించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయని ఏపీ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

# జమ్మూకశ్మీర్ విషయంలో చేయబోయేది అదే..: అమిత్‌షా

ఆర్టికల్ 370 రద్దు నాటి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ ప్రాంతానికి త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. లోక్ సభ ఎన్నికల ఆరో విడతలో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఎంపీ స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం కశ్మీర్ విషయంలో అనుసరించిన విధానం సరైనదేనని ఇది నిరూపిస్తోందని చెప్పారు. ఇది ఎన్డీయే ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయమని వ్యాఖ్యానించారు.

ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో అమిత్ షా తాజాగా ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్ కు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. జమ్మూకశ్మీర్ లో లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై హర్షం వ్యక్తం చేశారు.

**ఇది అతిపెద్ద విజయం**

లోక్ సభ ఎన్నికల్లో కశ్మీర్ లోని వేర్పాటు వాదులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ఓటు వేశారని.. అత్యధిక పోలింగ్ శాతం నమోదైందని అమిత్ షా చెప్పారు. ఇది చాలా ముఖ్యమైన పరిణామమని అభివర్ణించారు. జమ్మూకశ్మీర్ ప్రాంతంలో ప్రశాంతంగా, అత్యధిక స్థాయిలో పోలింగ్ జరగడమనేది మోదీ ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమన్నారు. తమ ప్రణాళిక ప్రకారం.. జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు



ఆదేశాల మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 30 నాటికి జమ్మూకశ్మీర్ కు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

**బీజేపీని బలోపేతం చేస్తున్నాం..**

ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ లో బీజేపీ అభ్యర్థిని బరిలోకి దింపకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని చెప్పారు. తమ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని.. భవిష్యత్తులో తమ అభ్యర్థులను పోటీకి పెడతామని తెలిపారు.

# బుక్స్, బూట్లు కొనాలంటూ.. ఇక్కట్లకు గురి చేస్తే అనుమతి రద్దు

**ప్రైవేట్ పాఠశాలలకు, కార్పొరేట్ స్కూల్ లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**



జనసముద్రం జమ్మికుంట (టౌన్) న్యూస్ ప్రతినిధి: 26 మే తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్నేషనల్, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను బుక్స్ (పాఠ్యపుస్తకాలు), బూట్లు (షూస్), ఏకరూప దుస్తులు (యూనిఫామ్), బ్యాగులు కొనుగోలు చేయాలని బలవంత పెట్టినా లేక ఇబ్బందులకు గురి చేసినా సంబంధిత విద్యాసంస్థల అనుమతులు రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించింది.ఈ మేరకు తెలంగాణలోని 33 జిల్లాల విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది.ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్, బూట్లు, యూనిఫామ్స్, బ్యాగులను పెద్ద మొత్తంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయని ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందాయి.విద్యార్థి సంఘాలు సైతం ఇదే అంశంపై తీవ్రస్థాయిలో ఉద్యమిస్తున్న విషయం విధితమే.తరగతులతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేస్తూ ఇతరత్రా అవసరాలను కల్పిస్తుండగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురి



చేసి వాటిని అమ్మబది కొనుగోలు చేయాలంటూ నిబంధన పెట్టడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.ఒకవైపు భారీగా పెంచిన వార్షిక ఫీజులు చెల్లించలేక విద్యార్థులు వారి తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రైవేటు యాజమాన్యాలపై కఠిన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.బుక్స్, బూట్లు, యూనిఫామ్స్, బ్యాగులు తమ వద్దే కొనుగోలు చేయాలంటూ విద్యార్థులను వారి తల్లిదండ్రులపై ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఒత్తిడి చేయడం చట్ట విరుద్ధం. ఇది ఎంత మాత్రం తగదని అధికారులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థి నుండి సుమారు రూ:10 వేల నుండి 20వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే ఇక ఆ తల్లిదండ్రుల ఖర్చులు, ఫీజులు తడిసి మోపడవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పరీక్షల ఫీజులతోపాటు టీచర్స్ డే, రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం, స్కూల్ వార్షికోత్సవం వేడుకలు ఇలా అన్ని ఫీజులు కలిపితే ఏటా ఒక్కో విద్యార్థికి రెండు లక్షల రూపాయలు ఖర్చు అవుతోందని ఈ భారం పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలు భరించలేకపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.చివరికి నోట్ బుక్స్, పెన్సిళ్ళు, పెన్నులు, జామెంట్రీ బాక్స్, డ్రాయింగ్ బుక్స్, సైన్స్ రికార్డులు ఐడి కార్డు లు, క్రీడా యూనిఫాం అమ్మకాలలోనూ యాజమాన్యాలు జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీంతో స్పందించిన ప్రభుత్వం ఇంటర్నేషనల్, కార్పొరేట్ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలలకు ముకుతాడు వేస్తూ విద్యాశాఖ అధికారులకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

## మహబుబాబాద్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్

మహబూబా జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 26 నల్గొండ ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి.. జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్నల్గొండ ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మే -27 న నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కొనసాగుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని పట్టభద్రుల ఓటర్లు వారి ఓటును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకుపోలింగ్ కేంద్రాల వద్ద ఎలా ఓటు వేయాలనే సమాచారాన్ని తెలిపే బ్యానర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేకమైన పెన్నును ఉపయోగించి ఓటు వేయవలసిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు కలవని ప్రతి ఒక్క పట్టభద్రుల ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఓటు వేయవలసిందిగా పట్టభద్రుల ఓటర్లకు సూచించారు. ఆదివారం రోజు ఫాతిమా హైస్కూల్ మహబూబాబాద్ నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్,అదనపు కలెక్టర్లు లోకల్ బాడీ, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్ ల పర్యవేక్షణలో పోలింగ్ బ్యాలెట్ బాక్స్ లను డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని అన్నారు.జిల్లాలో 18 మండల కేంద్రాలలో 36 పోలింగ్ కేంద్రాలకు డివిజన్ కేంద్రాలైన మహబూబాబాద్ లోని ఫాతిమా హైస్కూల్, తొర్రూరు లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు పంపిణీ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి అని కలెక్టర్



అన్నారు.8 రూట్లలో 8 మంది సెక్టోరియల్ అధికారులను నియమించడం జరిగిందని,39 మంది ప్రిసైడింగ్ అధికారులు , ఏపీవోలు, ఓపిఓలు 137 మంది పోలింగ్ అధికారులు,40 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగింది.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా పోలింగ్ స్టేషన్లు వారీగా పోలింగు మెటీరియల్స్ తో సహా పోలింగ్ బ్యాలెట్ బాక్సులను పోలీస్ బందోబస్తు తో పోలింగ్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం ఓటర్లు 34,933 కాగా అందులో 22,948 పురుషులుగాను 11 985 స్త్రీలుగా ఉన్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అలివేలు,మహబూబాబాద్ తహసిల్దార్ భగవాన్ రెడ్డి,మరియు పోలింగ్ అధికారులు సిబ్బందితోపాటు రెవెన్యూ యంత్రాంగం ఉన్నారు.

## సిపిఎం రాజకీయ శిక్షణ తరగతుల జయప్రదంకై ఆహ్వాన సంఘం ఏర్పాటు

### - ఎండి జహంగీర్ (సిపిఎం జిల్లా కార్యదర్శి

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి: జనసముద్రం న్యూస్ భువనగిరి పట్టణ కేంద్రంలో జూన్ 15, 16 తేదీలలో రెండు రోజులపాటు జరిగే సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల జయప్రదంకై ఏర్పాటుచేసిన ఆహ్వాన సంఘం సమావేశంలో ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న సిపిఎం నాయకత్వానికి పార్టీ సభ్యులకు రాజకీయంగా చైతన్యం కలిగించడం కోసం జూన్ 15,16 తేదీలలో భువనగిరి పట్టణ కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వారు అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా ప్రయోజనకర పథకాలను ప్రజలకు నేరుగా చేరేలా బాధ్యత తీసుకోవాలని,ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు కాలయాపన జరిగిన,ప్రస్తుతం ప్రజా సమస్యలను నియోజకవర్గాల వారీగా అధ్యయనం చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని వారు అన్నారు.ఈ నేపథ్యంలో సిపిఎం నాయకత్వానికి,పార్టీ సభ్యులకు రాజకీయ చైతన్యం కలిగించి, గ్రామీణ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర కార్యక్రమాలను రూపొందించి ప్రజా పోరాటాలను నిర్వహించడం కోసం భవిష్యత్ ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడం కోసం ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని వారు అన్నారు.అదేవిధంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ భువనగిరి పట్టణ కేంద్రంలో నిర్వహించే సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులకు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్తులు సహకరించి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వారు కోరారు.అనంతరం శిక్షణ తరగతుల ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది.గౌరవ




అధ్యక్షులు గద్దె నరసింహ,అధ్యక్షులు బట్టుపల్లి అనురాధ,ప్రధాన కార్యదర్శి మాయ కృష్ణ,చీఫ్ ప్యాటరన్స్ గా సంగు నరేందర్, సంగు రమాదేవి,ఉదయగిరి మధుమోహన్,పోకల దయానంద్, జిట్టా ధనాపరెడ్డి,ఉపాధ్యక్షులు గంధమల్ల మాతయ్య,బందెల ఎల్లయ్య,ఓవల్దాస్ అంజయ్య,బర్ల వెంకటేష్,దాసరి మంజుల,కార్యదర్శులుగా బండి రవి,పర్వతి బాలకృష్ణ,దండు గిరి,కల్లూరి నాగమణి,కొండెం నాగభూషణం,ప్రచార కార్యదర్శులు కొలుపుల వివేక్,వనం రాజు,చింతల శివ, ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ,గడ్డం వెంకటేష్,నాయకులు లావద్య రాజు,బోడ భాగ్య, లలిత,మాయ రాణి,గీస అంజయ్య,నరాల నరసింహ,గంగయ్య తదితరులు పాల్గొన్నారు.





## పగడాల కోటేశ్వరరావు ని పరామర్శించిన ముప్పాళ్ళ

జనసముద్రంన్యూస్, మే 26, పల్నాడు జిల్లా, నర్సరావుపేట.మండలంలోని దొండపాడు గ్రామంలో పగడాల కోటేశ్వరరావు భార్య పూర్ణమ్మ స్వర్గస్తులైన సందర్భంగా జోహార్లు అర్పించి పగడాల కోటేశ్వరరావు ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరావు పరామర్శించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు సిపిఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ వై చంచయ్య , సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ నరసరావుపేట ఏరియా నాయకులు ఉప్పలపాటి రంగయ్య , వైదన వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు షేక్ బుడే, పెద్దబాబు, సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, శశి తదితరులు పాల్గొన్నారు.




## లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ జాతీయ అవార్డు 2024 సెలక్షన్ లెటర్ అందుకున్న అంకం చంద్రమౌళి

జన సముద్రం ప్రతినిధి దేవరకొండ మే:26దేవరకొండ పట్టణంలోని అయ్యప్ప నగర్ చెందిన అంకం చంద్రమౌళిగతం 30 సంవత్సరాలగా వివిధ రంగాల్లో సేవలు చేసినందుకు గాను బహుజన సాహితి అకాడమీ వారు ఇతని సేవలను గుర్తించి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ జాతీయ అవార్డు 2024 గాను ఎంపిక చేశారు. బహుజన సాహితి అకాడమీ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ మరియు బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు అహ్వాన పత్రాన్ని హైదరాబాద్లోనే బహుజన సాహితీ అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సంవత్సరం జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూణేల నిర్వహించే బహుజన రైటర్స్ నాలుగవ సమావేశం సందర్భంగా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేయ నున్నట్టు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని ఈ కాన్ఫరెన్స్ లో మహారాష్ట్ర,మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరవుతారని తెలిపారు. ఈ అవార్డు సెలెక్ట్ జిల్లా కమిటీ చైర్మన్ చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మరియు బహుజన అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి అవార్డును సెలెక్ట్ చేసినందుకుగాను మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సేవ చేస్తానని అంకం చంద్రమౌళి తెలిపారు.






## దాసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### -పదవతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం:దాసన్న ఫౌండేషన్ చైర్మన్ ప్రదీప్ కుమార్ గౌడ్

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండలం పడమటి సోమారం గ్రామంలో తంతరపల్లి ప్రదీప్ గౌడ్ వారి తండ్రి మాజీ సర్పంచ్ స్వర్గీయ తంతరపల్లి రాందాసు గౌడ్ పేరుమీద దాసన్న ఫౌండేషన్ ఏర్పాటు చేసి గ్రామంలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతుల ప్రధానోత్సవం.గ్రామంలో దాదాపు 30 యువకులు రక్తదానం చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తలబోయిన గణేష్ యాదవ్,మాజీ జెడ్పిటిసి సంధి గారి బసవయ్య,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆల్వా మోహన్ రెడ్డి,దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ యర్రబోతు శ్రీనివాసరావు,పడమటి సోమారం గ్రామ వాస్తవ్యులు సిఐ రాగిర్ చంద్రమౌళి,పూజారి జార్పుల పుణ్యసింగ్,నాయకులు ఆలేటి రామ్ కొండల్,ఆల్వా బల్వంత్ రెడ్డి,యర్రబోతు ఆంజనేయులు,కుంభం భాస్కర్,జమ్మిగారి జనార్ధన్,బుర్రి బాలచందర్,బుర్రి బిక్షపతి,తంతరపల్లి ప్రసాద్ గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## భక్తులతో పోటెత్తిన ఏడుపాయల దేవస్థానం అమ్మవారికి ఓడి బియ్యం తలనీలాలు సమర్పింపు



జనసముద్రం న్యూస్,మే,26 (పాపన్నపేట) పాపన్నపేట మండల పరిధిలోని శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని దేవస్థానం ఆదివారం సెలవు దినం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు పోరుగు రాష్ట్రాలైనటువంటి మహారాష్ట్ర, కర్ణాటక,సోలాపూర్, హైదరాబాద్భక్తులు భారీ సంఖ్యలో రావడం జరిగింది అనంతరం భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కోరిన కోరికలు తీర్చే ఏడుపాయల వన దుర్గమ్మకు ఒడి బియ్యం, బోనాలు తలనీలాలు, సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు అమ్మవారి దర్శనానికి సుమారు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల పాలకమండలి తగు జాగ్రత్తలు తీసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరియు ఏడుపాయల పాలకమండలి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## కంఠ మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న జిల్లా మోకు దెబ్బ అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 26 కంఠ మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బూడిగే భద్ర సేన గౌడ్మహబూబాబాద్ జిల్లా కురవి మండల్ నేరడా లో జరిగిన కంఠమహేశ్వరా కళ్యాణ మహోత్సవం లోకురవి మండల అధ్యక్షులు గాదెగాని రమేష్ గౌడ్ నేరడా ఆధ్వర్యంలో గ్రామ పెద్ద గౌడ్ మాడూరి నారాయణ,నేరడాగ్రామ గౌడ అధ్యక్షులు, సర్పంచ్,మోకు దెబ్బ గ్రామ అధ్యక్షులు మాడూరి యాకన్నా కు శాలువాతో సన్మానం చేయడం జరిగింది, ఈఉత్సహం లో ,కొత్త నరేష్, గాదెగాని రాజు, కాంతయ్య, తాళ్లపెల్లి పానకాలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు పలు రైళ్లకు అంతరాయం



దామరచర్ల మండలం.మే 26. (జన సముద్రం న్యూస్): దామ రచర్ల మండల పరిధి లోని విష్ణుపురం రైల్వే స్టేషన్ పరిధిలో గుం టూరు, సికింద్రాబాద్ రైల్వే లైన్ మార్గంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడం జరిగింది.దీనితో రైల్వే అధికారులు అప్రమత్తమై శబరి ఎక్స్ ప్రెస్ ను మిర్యాలగూడలో మరియు జన్మభూమి ఎక్స్ ప్రెస్ ను పిడుగురాళ్ల స్టేషన్ లలో నిలిపివేశారు,పట్టాలు తప్పిన గూడ్స్ రైలు సమీపాన అధికారులు ముమ్మరంగా మరమ్మతు పనులు చేస్తున్నారు,పనులు పూర్తయిన వెంటనే ప్యాసింజర్ రైళ్లను నడపనున్నట్లు తెలిపారు.



## బొడ్రాయి వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

దామరచర్ల మండలం.మే 26.(జనసముద్రం న్యూస్): దామరచర్ల మండల పరిధిలోని వాచ్యతండ గ్రామం నందు నిర్వహించిన బోడ్రాయి పండుగ 3వ వార్షికోత్సవం లో మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు,వారిని గ్రామ నాయకులు సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు.వారి వెంట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కుందూరు వీర కోటిరెడ్డి,మాజీ సర్పంచ్ లావురి శ్రీను నాయక్,సీనియర్ నాయకులు కందుల నాగిరెడ్డి,గ్రామ నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పోలింగ్ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి:జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26, భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ భువనగిరి:-రేపు జరగబోయే ఉమ్మడి వరంగల్,ఖమ్మం,నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీ రాయగిరి విద్యాజ్యోతి హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్రతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు సందర్శించి మాట్లాడారు.పోలింగ్ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు సూచించారు.



## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరైన నాయకులు

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం రామ్ కుమార్ కుమార్తెల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో నెమరగోముల మాజీ ఉపసర్పంచ్ మెట్టు మోహన్ రెడ్డి నాయకులు ఎండి సలీం ఖాన్,కోరిమీల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





## విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మండలం రాయిగిరి గ్రామం నందు తంగళ్ళపల్లి వ్యవసాయ బావి వద్ద విశ్వకర్మ ఫౌండేషన్ హైదరాబాద్ అడ్లూరి రవీంద్రా చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ ఉచిత వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా టిపిసిసి డెలికెట్ తంగళ్ళపల్లి రవికుమార్ భువనగిరి మున్సిపల్ 35 వ వార్డ్ కౌన్సిలర్ తంగళ్ళపల్లి వాణి ముఖ్యఅతిదులుగా పాల్గొన్నారు.ఫౌండేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ సరైన సమయంలో పెళ్లిళ్లు చేసుకోవడం అవసరము అని వివాహ పరిచయ వేదికను పెట్టామని దీనిని అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు.ఈ యొక్క కార్యక్రమానికి వచ్చిన వారికి భోజన వసతులు ఏర్పాటుచేసిన తంగళ్ళపల్లి రవికుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 300 కుటుంబాలకు పైగా పాల్గొన్నారు.వారి యొక్క పూర్తి వివరాలను తెలియపరుస్తూ వివరణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెల్దుర్తి రఘువర్ధన్ చారి,దళిత సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య,పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నకృష్ణయ్య,అనసూరి శంకరాచార్యులు రిటైర్డ్ ఈసిఐఎల్,పెరికేటి యాదగిరి చారి ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్,రాగి శోభన్ బాబు తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్,అనసూరి రఘువీర్ దూరదర్శన్ ఫౌండేషన్ సభ్యులు, రంజిత్,కొలనూరు శ్రీనివాస్,సంకోజు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్క ఆశయాలను కొనసాగిస్తాం

### -టిపిసిసి డెలిగేట్ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్



యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ భువనగిరి పట్టణ కేంద్రంలో అమరవీల స్తూపం వద్ద బెల్లి లలిత చిత్రపటానికి తంగళ్ళపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క 25వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తంగళ్ళపల్లి రవికుమార్ మాట్లాడుతూ పాటనే జీవితంగా మలుచుకొని చివరి శ్వాస వరకు, స్వ రాష్ట్రం కోసం తెలంగాణ అస్తిత్వం కోసం,ఉద్యమించిన వీర వనిత,నిరుపేద కుటుంబంలో పుట్టి పొట్టకూటికోసం పత్తి మిల్లులో పనిచేసి,అక్కడ కార్మికుల హక్కుల కోసం సిఐటియులో చేరి కార్మిక హక్కులను సాధించింది,ఫ్లోరైడ్ తో బాధపడుతున్న ప్రజలను తన పాట ద్వారా చైతన్యపరిచి,1996లో ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటు చేశారు.ఈ నేపథ్యంలో 1997 మార్చి 8న భువనగిరిలో జరిగిన దగబడ్డ తెలంగాణ సభలో బెల్లి లలితక్క కీలక పాత్ర పోషించింది.ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో తెలంగాణ మహాసభలో తన పాట ద్వారా జనాలను చైతన్యపరిచింది,తన ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది దుండగులు ఆమెను హతమార్చడం జరిగింది.తెలంగాణ ప్రభుత్వం బెల్లి లలితక్క కుమారుడిని ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి,ట్యాంక్ బండ్ పై బెల్లి లలితక్క విగ్రహం తప్పకుండా ఏర్పాటు చేయాలి,అమరవీరుల కుటుంబాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య,బెల్లి లలిత కుటుంబ సభ్యులు,బెల్లీ సూర్యప్రకాష్,గాయకురాలు వెన్నెల,మొహమ్మద్ రఫీ ఉద్దీన్ గౌరీ (తాహెర్),ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం పిట్టల బాలరాజ్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## ఉపాధ్యాయుడు గ్రామపంచాయతీ రోడ్డు స్వాహా ఒక కుటుంబాన్ని నిర్బంధం





మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 26 మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం, కొంగిరిగిద్ద గ్రామం వాస్తువులు కూరపాటి రజిత భర్త కూరపాటి శ్రీనివాస్, వీరు గత 30 సంవత్సరాలుగా కొంగరిగిద్ద అనే గ్రామంలో నివసిస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం ఒకరి దగ్గర ఇంటి స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకున్నారు. దక్షిణ దిక్కు ఆంజనేయస్వామి దేవాలయమునకు రోడ్డు కలదు. కానీ పడమర ఉన్న పెనక అయిలయ్య అనే ప్రైమరీ పాఠశాల కొంగరిగిద్ద గ్రామ ప్రధానోపాధ్యాయులు నా ఇంటి నుండి గూడూరు వెళ్లే రోడ్డు వరకు నేను సొంతంగా కొనుక్కున్న రోడ్డు అని కూరపాటి రజిత కుటుంబాన్ని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అట్టి విషయాన్ని కూరపాటి రజిత కుటుంబ సభ్యులు ఇంటి ముందు ధర్నా చేసి మీడియాతో ఇలా వివరించారు. నేను కూరపాటి రజిత మేము ఇంటి జాగా కొనేటప్పుడు దక్షిణ దిక్కున రోడ్డు ఉంది అని ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య నోటరీ దస్తావేజులో రాశారు. కానీ ఇప్పుడు మాట మార్చి మా కుటుంబ సభ్యులను కొడతామని బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అదే కాకుండా మా ఇంటి తలుపు ముందు కంచె వేసి మమ్మల్ని కొట్టడానికి వస్తున్నారు. మాకు ప్రధాన ఉపాధ్యాయులు, సబ్- ఇన్స్పెక్టర్ ఫ్యామిలీతో ప్రాణ హాని ఉంది. ఈ విషయాన్ని పెద్దమనుషులతో చర్చించగా పెద్దమనుషులు న్యాయమైన పరిష్కారం చూపించారు కానీ దానికి ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య అన్నయ్య పినక వెంకటరాములు పోలీస్ డిపార్ట్మెంట్ ఖమ్మంలో పని చేయడం వలన, మా అన్న పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని మా కుటుంబ సభ్యుల్ని భయభ్రాంతులకు గురిచేసి గొడ్డలితో కొట్టడానికి పైకి వస్తున్నారు. గ్రామ పెద్ద వీరస్వామి దొర, జంపయ్య పటేల్ మాట్లాడుతూ ఈ రోడ్డు గత 60 సంవత్సరాలుగా దేవస్థానానికి చెందినది. ఈ రోడ్డు ఎవరి సొత్తు కాదు అందరూ నడవవచ్చు. అనే పదిమందిలో తీర్మానం చేసినం. కానీ ప్రధానోపాధ్యాయులు, సబ్ -ఇన్స్పెక్టర్ కుటుంబ సభ్యులు మా మాట ధిక్కరించి పెద్దమనుషులని చూడకుండా, రజిత ఫ్యామిలీని మా కళ్ళ ముందే భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పై రోడ్డు విషయం తీర్మానం చేసిన పెద్ద మనుషులు కూరపాటి మల్లయ్య, నర్సయ్య, బాబు, సమ్మయ్య, చింటు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

# సేవ రత్న జాతీయ అవార్డు 2024

### ఎంపికైన ఎఫ్ డబ్లూ ఓ ,అర్ టి ఐ రాష్ట్ర అధ్యక్షులు కొర్ర, కిషన్ నాయక్



జన సముద్రం ప్రతినిధి దేవరకొండ మే:26 దేవరకొండ నియోజకవర్గం గుండ్లపల్లి (డిండి )మండలంలోని కొత్తతండా గ్రామపంచాయతీకి చెందిన కొర్ర. కిషన్ నాయక్ గత 10 సంవత్సరాలగా వివిధ రంగాల్లో మరియు సమాచార హక్కు చట్టం 2005 మీద ప్రజలలో అవగాహనా కలిపిస్తూనందుకు గాను బహుజన సాహితి అకాడమీ వారు ఇతని సేవలను గుర్తించి సేవరత్న జాతీయ అవార్డు 2024 గాను ఎంపిక చేశారు. బహుజన సాహితి అకాడమీ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ మరియు బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్ లోనే బహుజన సాహితీ అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సంవత్సరం జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూనేలో నిర్వహించే బహుజన రైటర్స్ నాలుగవ సమావేశం సందర్భంగా సేవ రత్న నేషనల్ అవార్డును అందజేయనున్నట్టు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని ఈ కన్ఫరెన్స్ లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరైవుతారని తెలిపారు. ఈ అవార్డు సెలెక్ట్ చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మరియు బహుజన అకాడమీ వారికీ కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి అవార్డును సెలెక్ట్ చేసినందుకుగాను మరింత ఉత్సాహంతో అవగాహనా కలిపిస్తూ, పనిచేసి ప్రజలకు సేవ చేస్తానని ఆర్ టి ఐ రాష్ట్ర అధ్యక్షులు కొర్ర. కిషన్ నాయక్ తెలిపారు.



## బొడ్రాయి పండుగ లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల మండలం.మే 26.(జనసముద్రం న్యూస్):దామరచర్ల మండల పరిధిలోని వాచ్య తండా గ్రామంలో బొడ్రాయి పండుగ మూడవ వార్షికోత్సవ వేడుకను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు,ఇట్టి కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు,వారికి గ్రామ నాయకులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.వారి వెంట నల్లగొండ జిల్లా డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్,సీనియర్ నాయకులు స్కైలాబ్ నాయక్,డిసిసి జనరల్ సెక్రటరీ నాగు నాయక్,ఎంపీపీ నందిని రవితేజ మరియు కాంగ్రెస్ నాయకులు,బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పైళ్ల

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం రామ్ కుమార్ కుమార్తెల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ జడల అమరేందర్,జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ కొలుపుల అమరేందర్,జెడ్పిటిసి బీరు మల్లయ్య,భువనగిరి మాజీ పిఏసిఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకటేష్ గౌడ్,మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



## మండలంలో వీచిన ఈదురు గాలులు

జనసముద్రంన్యూస్,మే26,పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం. మండలంలో ఆదివారం సాయంత్రం మేఘాలు నల్లగా కమ్ముకొని కాసేపు చిరుజల్లులతో పాటు ఈదురు గాలులు బలంగా రావటం జరిగింది. ఈ ఈదురు గాలులకు ఉప్పలపాడు కి సమీప పొలాల్లో ఎండిపోయిన కుంకుడు చెట్టు విరిగి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.



## పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు:డిసిపి రాజేష్ చంద్ర

యాదాద్రి భువనగిరి జిల్లా మే.26,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా:-రేపు జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 17 మండలాలలో 37 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరగనుంది పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని డిసిపి రాజేష్ చంద్ర తెలిపారు.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి దాటి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.బ్యాలెట్ పేపర్లను పోలింగ్ కేంద్రాలకు భద్రత బలగాల సమక్షంలో తరలించనున్నారు.ఎన్నికల కోడ్ నియమాలను పాటించాలన్నారు

# అలిపిరి మెట్ల మార్గం కు ...అలిపిరి అనే పేరు ఎలా వచ్చిందో తెలుసా?

## గోవింద భక్తుల్లారా...? ఈ విషయాని తెలుసుకోండి

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ మే 26 జనసముద్రం న్యూస్ తిరుమల తిరుపతి న్యూస్:–కొండ క్రింద ఉన్న ఈ "అలిపిరి" కి ఆ పేరు ఎలా వచ్చిందో మనలో చాలామందికి తెలియదు. అసలు " అలిపిరి " అనే పేరే ఒక విచిత్రమైన పేరు లాగా ఉంది కదా ... ? మన తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం ఇలా ఏ భాషలోనూ ఈ " అలిపిరి " అనే పదం లేదు.అయితే, " అలిపిరి " అనే ఈ పదం ఎలా పుట్టింది ... ?దీని వెనుక చరిత్ర ఏమిటి ... ?అనే విషయం మన చరిత్రని నిశితంగా గమనించినట్లయితే ఆశ్చర్యకరమైన యదార్ధ సంఘటలను గురించి మనం తెలుసుకోవచ్చు.పూర్వం ఐదు వందల సంవత్సరాల క్రితం," తిరుపతి " నగరం ఇప్పటిలాగా లేదు.ఇప్పుడు " అలిపిరి " అని పిలుస్తున్న ప్రాంతానికి–"అలిపిరి" అన్న పేరు కూడా లేదు.అది ( 1656 - 1668 ) ప్రాంతం .ఢిల్లీలో మొఘల్ చక్రవర్తులు పాలిస్తున్న సమయం. శ్రీ కృష్ణ దేవరాయల అనంతరం జరిగిన " రాక్షసి తంగడి %ఁ% తళ్ళికోట " మొ ఎఎ యుద్ధాల తర్వాత, విజయనగరం రాజుల ప్రాబల్యం తగ్గింది. అప్పుడు నిజాం నవాబు రాయల సీమ ప్రాంతాన్ని ఆక్రమించాడు.ఆ సమయంలో హిందువులను, హిందూ సానుభూతిపరులను, సాధుసంతులను చాలా దారుణంగా హింసించారు.పదిహేడో శతాబ్దం చివరిలో ఢిల్లీ ఆదేశాల మేరకు, హైదరాబాద్ నిజాం ప్రభుత్వం ఫర్మానా ( ఆర్డర్ ) మేరకు సుల్తాన్ అబ్దుల్లా – కుతుబ్ షా %ఁ% వజీర్ల సైన్యం, " ఆలీ " అనే అత్యంత కరడుగట్టిన మహమ్మదీయుని నేతృత్వంలో, కడప, కర్నూలు, నెల్లూరులలో దారుణంగా దాడులు చేసి దేవాలయాలను ధ్వంసం చేసారు. ఆ తరువాత " ఆలీ " సైన్యం తిరుపతికి చేరుకుంది.అప్పుడు, తిరుపతి చిన్న గ్రామం.ఇప్పుడు " మంచినీళ్ళ కుంట " అని చెప్పుకుంటున్న" నరసింహ తీర్థమే " అప్పటి తిరుపతి గ్రామం.ఇక్కడ ఒక నరసింహ స్వామి మందిరం ఉంది, దానికి ప్రజలు నిత్యం ధూప, దీప, నైవేద్యాలు సమర్పిస్తుండేవారు. చరిత్ర తెలిసిన పెద్దవారు ఇప్పటికీ దీనిని " నరసింహ తీర్థం రోడ్ " అనే పిలుస్తారు.ఆలీని తిరుపతికి పైకి దండయాత్రకు పంపించటానికి మూల కారణాలు రెండు ఒకటి : శ్రీ వేంకటేశ్వర స్వామి వారు అత్యంత శక్తివంతమైన దేవుడు అనీ %ఁ% తిరుమల లాంటి దివ్య క్షేత్రం ఇంకొకటి లేదు, భవిష్యత్తులో ఉండబోదు అనే వైభవమ్ విశ్వాసం భారత దేశం నేల నాలుగు చెరలా ఉండడం వలన, ఈ దేవాలయం పై దాడి చేసి స్వామి వారి స్వరూపాన్ని పెకలించి కొండపై నుంచి తొలగించేస్తే, హిందువుల దేవుడు బలహీనుడనీ తద్వారా, ప్రజలందరూ " అల్లా " యే గొప్ప దేవుడని భావించి, " ఇస్లాం " మతాన్ని విధిలేక స్వీకరిస్తారని వారి పిచ్చి ఆలోచన.రెండోది : శ్రీ కృష్ణ దేవరాయలు, భక్తితో స్వామి వారికి సమర్పించుకున్న విలువ కట్టలేనన్ని వజ్రాలు, వైఢూర్యాలు, కనక పుష్యరాగాలు, కెంపులూ అపారమయిన బంగారం దోచుకెళ్ళి వాళ్ళ ఖజానా నింపుకుందామని.అయితే అప్పటి తిరుపతి గ్రామస్తులు, " ఆలీ " ( కమాండర్ ఇన్ చీఫ్ ) ని సమీపించి నీక్కావలసింది బంగారమే కదా ! మా తిరుపతి గ్రామంలో ఉన్న స్త్రీ %ఁ% పురుషుల వద్ద వున్న బంగారం అంతా ఇచ్చేస్తాం, దానితో తృప్తిపడి వెనక్కి వెళ్ళిపో, కానీ మా స్వామి వారి జోలికి రావద్దు, ఆయన మా ప్రాణం కన్నా కూడా ఎక్కువ అని విన్నవించుకున్నారు.దానికి ఆలీ అంగీకరించినట్లు నటించి వాళ్ళు స్వచ్ఛందంగా ఇచ్చిన బంగారం, ఆభరణాలు తీసుకుని, మీరు చెప్పింది బాగానే ఉంది కానీ, ఈ దేవాలయాన్ని దోచుకుని ధ్వంసం చెయ్యకపోతే నిజాం నవాబూ %ఁ% ఢిల్లీ సుల్తాను నా తల తీసేస్తారు కాబట్టి, తప్పదు అని తన అపార బలగాలతో ముందుకు కదిలాడు.సరిగ్గా ఇప్పుడు " అలిపిరి " అని పిలవబడుతున్న ప్రాంతాన్ని చేరుకోగానే, శ్రీ ఆది వరాహ



స్వామి అవతారమైన శ్రీవారు వరాహ రూపంలో వచ్చి నిలువరించారు.మొదట కొంచెం బెదిరినా కూడా ముందుకు కదిలాడు. అంతే హఠాత్తుగా ఎవరి ప్రమేయమూ లేకుండా అతని రెండు కళ్ళూ పోయాయి, దృష్టి పోవడంతో దిక్కులేని స్థితిలో ఎంతో విలపించాడు.అప్పుడు , శ్రీ స్వామి వారి " అమృత వాణి " వాడికి వినబడింది, దైవం పైనే దాడికి సిద్ధపడ్డావా ? ఎంత ధైర్యం ... ? అని. అప్పుడు ఆలీ బిగ్గరగా రోదిస్తూ ... క్షమాభిక్ష అడిగి, నేత్ర దానం చెయ్యమని వేడుకున్నాడు.అప్పుడు దయార్ద్రచిత్తుడయిన స్వామి వారు, నీవు వెనుదిరిగి వెళ్ళిపో, నీకు దృష్టి వస్తుం దని ఆదేశించారు.దానితో ఏమీ సాధించ కుండానే రిక్త హస్తాలతో వెనుదిరిగాడు "ఆలీ".ఉర్దూ లేక హిందీ భాషలో " ఫిర్ నా " అంటే వెనక్కి మళ్ళడం, " ఫిరే ' అంటే వెనక్కి మళ్ళాడు అని అర్ధం.ఎప్పుడు, ఎక్కడా ఓటమెరుగని పరమ ఆ దుర్మార్గుడైన ఆలీ వెనుతిరిగిన వెంటనే ఈ విషయం తెలుసుకున్న అందరూ " ఆలీ ఫిరే, ఆలీ ఫిరే " అని చెప్పుకు నేవారు.కొన్ని సంస్థానాలకి సంబంధించిన గ్రామా లలో అయితే తిరుపతి ఆలయం మీదకు దండయాత్రకు వెళ్లిన ఆలీ తిరుపతిలోని ఒక ప్రదేశం నుంచి ముందుకెళ్లలేక వెనుదిరిగాడు " ఆలీ ఫిరే ","ఆలీ ఫిరే" అని సూచిస్తూ చాటింపులు సైతం వేయించారు." ఆలీ " ఏ ప్రాంతం నుంచి వెనక్కి మళ్ళాడో ఆ ప్రాంతాన్నే అప్పటివారు ప్రత్యేకంగా వచ్చి సందర్శించేవారు.ఆ ప్రదేశాన్ని చూడటానికి వెళ్ళేటప్పుడు లేదా వెళ్లి వచ్చిన తర్వాత ఎక్కడికి వెళ్లారని ఎవరైనా అడిగినప్పుడు " అలీ ఫిరే"ప్రదేశానికి వెళ్తున్నామని చెప్పేవారు. కాలక్రమంగా ఆ ఆలీ ఫిరే అనే పదం – ఆలి పిరే గా రూపాంతరం చెంది ఇప్పుడు " అలిపిరి గా స్థిరపడింది.ఇదీ మనమిప్పుడు " అలిపిరి " గా పిలుచుకునే ప్రదేశం యొక్క యదార్థమైన చరిత్ర. ఈ విధంగా శ్రీవారి మహిమ వలన ఆలీ వెనుదిరిగిన కారణంగా, ఈనాడు మనం చూస్తున్న " అలిపిరి ఏర్పడింది

# కడియాల పల్లి గ్రామంలో..! హార్ట్ మరియు మోకాలు

# ఆపరేషన్, చేయించుకున్న పేషెంట్లను, పర్మాంసించిన "అన్నపూర్ణాదేవి ముక్కా వరలక్ష్మి వారు"

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ మే 26 జన సముద్రం న్యూస్ రైల్వే కోడూర్ నియోజకవర్గంలో ఓబులవారిపల్లి మండలం, గోవిందంపల్లి పంచాయితీ, కడియాల పల్లి గ్రామ వాస్తవ్యులు, గంగవరం ప్రభావత్తమ్మ గారికి హార్ట్ ఆపరేషన్ మరియు గంగవరం పెంచలయ్య, నాగినేని వెంకటసుబ్బమ్మ,కోసూరి దానయ్యగారికి మోకాళ్ళ ఆపరేషన్ అయిన విషయం తెలుసుకున్న లిరైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి వారి సతీమణి అన్నపూర్ణాదేవి ముక్కా వరలక్ష్మి వారు మరియు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరవ శ్రీధర్ వారిని పరామర్శించి,ధైర్యం చెప్పడం నేనున్నానంటూ తెలియజేయడం జరిగింది, ఆ మహాతల్లి రాకతో గ్రామంలోని ప్రజలు వృద్ధులు ఆ గ్రామం పెద్ద కూతురుగా ఆహ్వానించడం..!! ప్రతి ఒక్కరితోనూ, ఆప్యాయతగా పలకరించడం, ప్రేమ అభిమానాలంటే ఈ విధంగా ఉంటాయా అనుకునే విధంగా.. అన్నపూర్ణాదేవి ముక్క వరలక్ష్మి వారిని ఆహ్వానించి గౌరవించడం జరిగినది..ఈ కార్యక్రమంలో , గంగవరం శ్రీనివాసు నాయుడు, మంగళంపల్లి సర్పంచ్ కె శివ, కోసూరి శ్రీకాంత్, ధర్మయ్య నాయుడు, చంగయ్య, కన్నయ్య, జి ప్రసాద్, ఆంజనేయులు, భాస్కర్, దాసరి శ్రీనివాస్, కే రాజయ్య, ఎం శంకరయ్య, మద్దిపట్ల శంకరయ్య, మద్దిపట్ల వెంకటసుబ్బయ్య, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సాలవ రమణ రాజు, పొలసాని కిరణ్ కుమార్,శివయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం, అంజిరెడ్డి, వెంకటరమణారెడ్డి, టి రాజా, తదితరులు పాల్గొన్నారు.



# మాచర్లలో ఆగని హింసాకాండ మహిళ పై వైసీపీ గూండా దాడి

జనసముద్రంన్యూస్, మే26, పల్నాడు జిల్లా,మాచర్ల నియోజకవర్గం, మాచర్ల పట్టణం. పట్టణంలోని 22వ వార్డులో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతో వైసీపీ గూండా ఉప్పుతోళ్ళ వెంకటేష్ రెచ్చిపోయాడు. నీలావతి అనే మహిళపై కత్తితో అత్యంత పాశవికంగా దాడి చేసి.. హత్యాయత్నానికి ఒడిగట్టాడు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎన్నికలు ముగిసిన నాటి నుంచి వీధుల్లో కత్తితో వీరంగం సృష్టిస్తూ.. మా అన్న పిన్నెల్లి జోలికొస్తే కత్తితో పొడుస్తా.. టీడీపీ నాయకులు వార్డులో కనిపిస్తే చంపేస్తా అంటూ బూతులు తిట్టుకుంటూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. తురక కిషోర్ కు ప్రధాన అనుచరుడిగా.., దాదాపు 10 కేసులకు పైగా ఉన్న వెంకటేష్ పై పోలీసులు ఇంకా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మే13 పోలింగ్ రోజు %ౡఔణ% కాలనీ, పాలువాయి గేటు, ఆ మరుసటి రోజు కారంపూడిలో వైసీపీ గూండాలు సృష్టించిన అల్లర్లు , దాడుల్లో వెంకటేష్ కీలక పాత్ర పోషించాడు. ఇటువంటి రౌడీల పట్ల పోలీసులు ఎందుకింత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి.. వెంకటేష్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.





# ప్రభుత్వ నిబంధనలను... తుంగలో తొక్కిన, కార్పొరేట్ నారాయణ యాజమాన్యం

### గుర్తింపు లేకుండా అక్రమ అడ్మిషన్స్ చేస్తున్న...!! నారాయణ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి...??

### గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి "డీఎం ఓబులేసు యాదవ్"

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ మే 26 జన్సముద్రం న్యూస్ఉమ్మడి కడప జిల్లా కడప పట్టణంలో....విద్యా హక్కు చట్టాన్ని, ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా అనుమతి లేకుండానే అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న నారాయణ యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు దుర్గమ్మ టెంపుల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన నారాయణ స్కూల్ ఎదుట ఆందోళన చేశారు ఈ సందర్భంగా గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సిద్ధిక్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా 300 అడ్మిషన్స్ వరకు చేశారాని తెలిపారు విద్యాశాఖ అధికారులకు మామూలు మత్తులో పడి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు విద్యాసంస్థలోనే నారాయణ పేరుతో ముద్రించిన పుస్తకాలు యూనిఫామ్ అన్ని రకాల మెటీరియల్స్ విద్యాసంస్థలోనే కొనాలని ఆదేశిస్తున్నారని మండిపడ్డారు తల్లిదండ్రుల నుండి %శ్రీనెస్త్ర% నుంచే వేల రూపాయలు డొనేషన్ల రూపంలో ఫీజుల రూపంలో జలగళ్ల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే నారాయణ యాజమాన్యం పై చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో నాయకులు పృథ్వి, సురేంద్ర, కుమార్ పాల్గొన్నారు











# ఆంధ్ర ప్రదేశ్ ప్రతి జిల్లాలోనూ, పోలీస్ శాఖ (డిజిపి) తీసుకుంటున్న భద్రత...?

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ మే 26 జనసముద్రం న్యూస్ అమరావతి:ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీస్ శాఖ చర్యలు ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు మొత్తం 56 మంది పోలీస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియామకం ఇవాళ ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని ప్రత్యేక పోలీస్ అధికారులకు సూచన సున్నిత ప్రాంతాల్లో శాంతిభద్రతల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని ఏపీ డీజీపీ ఆదేశం పల్నాడుకు అత్యధికంగా 8 మంది పోలీస్ అధికారుల కేటాయింపు.



# బడిగింజల చౌడయ్య మూడవ వర్ధంతి సందర్భంగా మహా గొప్ప అన్నదానం

డాక్టర్ సుగుణ, డాక్టర్ కార్తీక్డాక్టర్ జ్యోతి, డాక్టర్ నాగార్జునరైల్వే కోడూరు జనసముద్రం న్యూస్ మే 26ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం అప్పారావు సర్కిల్ కాశి నగరం నందు జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం నందు కీర్తిశేషులు బడిగింజల చౌడయ్య మూడవ వర్ధంతి సందర్భంగా వారి ప్రథమ కుమార్తె జాతీయ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నగరం తిరుమల తిరుపతి పట్టణం ప్రముఖ సిమ్స్ వైద్యశాల ప్రముఖ డాక్టర్ సుగుణ, అల్లుడు డాక్టర్ కార్తీక్ రెండవ కుమార్తె డాక్టర్ జ్యోతి, రెండవ అల్లుడు డాక్టర్ నాగార్జున మరియు చౌడయ్య గారి ధర్మపత్ని రాజ్యలక్ష్మి జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం చేరుకొని వృద్ధులకు దివ్యాంగులకు బాల బాలికలకు అద్భుత అన్నదానం వారి చేతుల మీదగా వడ్డించి ఎన్నో రకాల రుచికరమైన భోజనాలను ఎన్నో రకాల రుచికరమైన కూరలను అద్భుతమైన రీతిలో మహా అద్భుత గొప్ప అన్నదానం జరిపించారు ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరూ పేరుపేరునా అన్నదాతలైనటువంటి బడిగింజల రాజ్యలక్ష్మి గారికి వారి ప్రథమ కుమార్తె సుగుణ గారికి అల్లుడు డాక్టర్ కార్తీక్ గారికి అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం ప్రభుత్వ ప్రముఖ డాక్టర్ కార్తిక్ గారు రెండవ కుమార్తె డాక్టరు జ్యోతి, రెండవ అల్లుడు డాక్టర్ నాగార్జున వీరందరికీ ఆనంద నిలయంలో ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలిపారు ఇలాగే అన్నదానం జరిపించదలచిన దాతలు క్రింది ఫోన్ నెంబర్లు సంప్రదించవలెనని తెలిపారు 970310575 5, 901418427 985010053 848096 48 0915

# శేషాద్రిని 70సార్లు నరికి హత్య చేసిన ప్రత్యర్థులు



అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ మే 26 జనసముద్రం న్యూస్ అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గంలో మదనపల్లె అయోధ్యనగర్లో శనివారం వేకువ జామున రామారావుకాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రిని వేట కొడవళ్లతో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. స్థానికంగా ఉండే భూ దందాల ముఠాలోని సుమారు 30 మంది అనపగుట్టకు వెళ్లి అయోధ్యనగర్లో కాపురం ఉన్న శేషాద్రిని కత్తులు, వేట కొడవళ్లతో 70సార్లు నరికి అతి కిరాతకంగా హతమార్చారు. జిల్లా ఆస్పత్రి మార్చురీకి వచ్చిన మృత దేహాన్ని పరిశీలించిన వైద్యులు, పోలీసులు 70 కత్తి పోట్లు చూసి విస్తు పోయారు...



# కురువ విద్యార్థిని విద్యార్థులకు 88 మంది ప్రోత్సాహ బహుమతులు

జనసముద్రం ప్రతినిధి, పెద్దకడబూరు :కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు 88 మందికి ప్రోత్సాహకాలు ఆదివారం పెద్దపాడు రోడ్ లో గల భీరప్ప దేవాలయం నందు జరిగిన కార్యక్రమంలో షీల్డ్ సర్టిఫికెట్ నగదు బహుమతి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ముఖ్యఅతిథి రామచంద్రయ్య, గుడిసె శివన్న మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతస్థాయి శిఖరాలను అధిరోహించేలా ఆలోచన విధానం ఉండాలని అలాగే ప్రతి విద్యార్థి ఐఎఎస్ ఐపీఎస్ డాక్టర్ ప్రొఫెసర్ సైంటిస్ట్ ఇలాంటి ఆలోచనలతో ముందుకెళ్లాలని సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చి తమ కుటుంబాలకు గౌరవం దక్కేలా విద్యార్థులు మెలగాలని ఒకప్పటి గొర్రెల కాపరుల పిల్లలు నేడు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కృష్ణన్న, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, తౌడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కత్తి శంకర్, వెంకటేశ్వర్లు, ఉరుకుంద, సహాయ కార్యదర్శి దేవేంద్ర, పాలసుంకన్న, మహిళా సంఘం అధ్యక్షురాలు లీలమ్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.




# వర్చువల్ క్రెడిట్ కార్డులు..

వర్చువల్ క్రెడిట్ కార్డులంటే డిజిటల్ క్రెడిట్ కార్డులు. ఇవి ఆన్‌లైన్‌లో లభిస్తాయి. వీటికి భౌతిక రూపం ఉండదు. అయినప్పటికీ సాధారణ క్రెడిట్, డెబిట్ కార్డులవలే కార్డు నంబర్, సీవీవీ, వ్యాలిడిటీ తేదీలుంటాయి. ఈ వివరాలన్నీ కూడా మీకు ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం చాలా ప్రధాన క్రెడిట్ కార్డు జారీదారులు ఈ వర్చువల్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నారు. అయితే వినియోగదారులు వీటిని ఆన్‌లైన్ లావాదేవీల్లోనే వాడుకోగలరు. వర్చువల్ క్రెడిట్ కార్డులు వన్-టైమ్ యూసేజ్ ఆప్షన్‌తో వస్తాయి. ఒకసారి వచ్చిన కార్డు నంబర్‌తో 24 గంటల నుంచి 48 గంటల వరకు మాత్రమే లావాదేవీలు జరుపగలం. దుర్వినియోగం, దొంగతనం వంటి సమస్యలను వీటి ద్వారా కస్టమర్లు అధిగమించగలరు. ఒకవేళ ఈ కార్డు తమకు అక్కర్లేదనుకుంటే కార్డుహోల్డర్లు క్యాన్సిల్ చేసుకోవచ్చు. లేదా బ్లాక్ చేసుకోవచ్చు. వర్చువల్ క్రెడిట్ కార్డు అనేది మీ దగ్గరున్న క్రెడిట్ కార్డుకు ఆన్‌లైన్ రూపం. దీనికో యూనిక్ క్రెడిట్ కార్డు నంబర్ ఉంటుంది. మీ ఒరిజినల్ క్రెడిట్ కార్డు వివరాలు తెలుపకుండానే దాని ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు చేపట్టవచ్చు. వన్-టైమ్ కోడ్‌తో ఇది పనిచేస్తుంది. తొలుత కార్డు నంబర్‌ను ఇన్‌పుట్ చేయాలి. ఆపై వ్యాలిడిటీని ఎంటర్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీతో వెరిఫై చేసుకొని లావాదేవీని పూర్తిచేయవచ్చు.

## ‘ఆటో’ అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో వాహన విక్రయాలు అంతంత మాత్రంగా సాగాయి. 2024%-%25 తొలి నెలలో మొత్తం 3.38 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు జరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3.32 లక్షల యూనిట్లతో పోలిస్తే 1.77% మాత్రమే అధికంగా ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిమాండ్ తగ్గడం, అంతకు ముందు రెండేళ్ల అధిక బేస్ ప్రభావం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ? దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఏప్రిల్‌లో 168,089 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదేనెలలో అమ్మకాలు 1,60,529 కార్లతో పోల్చితే 5% వృద్ధిని నమోదు చేసింది. హ్యుందాయ్ గతేడాది ఏప్రిల్‌లో మొత్తం 58,201 వాహనాలను విక్రయించగా, ఈ సంఖ్య 9.5% పెరిగి 63,701 యూనిట్లకి చేరింది. టాటా మోటార్స్ వాహన విక్రయాలు 11.5% వృద్ధి సాధించాయి. ఏప్రిల్‌లో 77,521 వాహనాలు అమ్ముడయ్యాయి. ఇవి ఏడాది ఏప్రిల్‌లో 69,599 యూనిట్లుగా ఉన్నాయి.




# కేంద్రానికి వీఐఎక్స్ గుబులు

## మదుపర్ల భయాలను పోగొట్టే పనిలో మంత్రులు సీతారామన్, జయశంకర్

న్యూఢిల్లీ, మే 15: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వానికి భారతీయ అస్థిరత సూచీ (ఇండియా వీఐఎక్స్) గుబులు పట్టుకున్నది. విపరీతంగా పెరిగిన ఈ సూచీ.. స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులకు నిదర్శనమని, ఈసారి ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం గెలుపు అంచనాలపై మదుపరులలో ఉన్న ఆందోళనల వల్లే ఈ ఆటుపోట్లంటూ మంగళవారం మెజారిటీ మార్కెట్ నిపుణులు విశ్లేషించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై ఏమాత్రం ఆలస్యం చేయకుండా మోదీ సర్కారు ఇటు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను, అటు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జయశంకర్‌ను రంగంలోకి దించింది. ఈ క్రమంలోనే జయశంకర్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో, సీతారామన్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో ప్రసంగిస్తూ వీఐఎక్స్‌ను ప్రస్తావించారు. వ్యాపారులు, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు ధైర్యాన్ని నూరిపోశారు.

**పెట్టుబడులు ఆగవద్దని..**

నిజానికి గతకొద్ది నెలలుగా ఈ ఇద్దరు మంత్రుల్ని.. వ్యాపార-పారిశ్రామిక రంగాల పెద్దలను, దేశ-విదేశీ మదుపరులను ఆకట్టుకోవడానికి మోదీ సర్కారు వినియోగించుకుంటున్నది. పెట్టుబడులు ఆగితే అది జనాల్లోకి తప్పుడు సంకేతాలను పంపుతుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడుతున్నది మరి. ఇక వీఐఎక్స్‌పై జయశంకర్ మాట్లాడుతూ.. ప్రగతికి ఆస్కారమున్న రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, మోదీ ప్రభుత్వం దానికి పెద్దపీట వేస్తుందని వివరించారు. అంతకుముందు రోజు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి స్పష్టమైన, బలమైన మెజారిటీ వస్తుందని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లే అన్ని నిర్ణయాలను స్వేచ్ఛగా తీసుకోగలుగుతుందని చెప్పారు. బీఎస్ఈలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ‘ఇటీవలి కాలంలో ఒడిదొడుకుల సూచీ హెచ్చుతగ్గుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు’ అన్నారు.

**భయమెందుకు?**

వీఐఎక్స్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పైకి వ్యాపార, పారిశ్రామిక, పెట్టుబడి వర్గాలకు కేంద్రం చెప్తున్నా.. లోపల మాత్రం భయపడుతూనే ఉన్నది. అందుకే మంత్రుల చేత పదేపదే ఈ అంశంపై మాట్లాడుతూ వస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో, ఎంఎస్ఎంఈలతో జయశంకర్, సీతారామన్‌లు సమావేశమవుతుండటం గమనార్హం.

# టెస్లా లోగోను వాడుతున్న భారత కంపెనీ!

గురుగ్రామ్‌లోని టెస్లా పవర్ ఇండియా అనధికారికంగా తమ ట్రేడ్‌మార్క్‌ను వాడుకుంటోందని ఎలాన్‌మస్క్ ఆధ్వర్యంలోని టెస్లా ఇంక్ గురువారం దిల్లీ హైకోర్టులో ఫిర్యాదు చేసింది. టెస్లా పవర్.. టెస్లా ఇంక్ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని సంస్థ తరఫు న్యాయవాది చందర్ లాల్ కోర్టును అభ్యర్థించారు. ‘గురుగ్రామ్ ఆధారిత కంపెనీ టెస్లా పవర్ ఇండియా.. టెస్లా ఇంక్ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించడం వల్ల వినియోగదారుల్లో గందరగోళం ఏర్పడుతోంది. కంపెనీ వ్యాపారాలపై కూడా దాని ప్రభావం పడుతోంది. టెస్లా పవర్ బ్యాటరీలకు సంబంధించిన ఫిర్యాదులను తమ వినియోగదారులు పొరపాటుగా టెస్లా ఇంక్‌తో లింక్ చేస్తున్నారు. ఆ ఫిర్యాదులను నేరుగా అమెరికన్ కంపెనీకి ఫార్వర్డ్ చేస్తున్నారు. టెస్లా పవర్ ఎలక్ట్రిక్ వెహికల్ కంపెనీగా జాతీయ వార్తాపత్రికల్లో అమెరికన్ కంపెనీ లోగోతో ప్రచారం చేసింది. టెస్లా పవర్ ‘టెస్లా’ ట్రేడ్‌మార్క్ వినియోగానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి’ అని చందర్‌లాల్ వాదనలు వినిపించారు. టెస్లా పవర్ ఈవీ బ్యాటరీలను ఉత్పత్తి చేయదని సంప్రదాయ వాహనాలు, ఇన్వర్టర్లలో ఉపయోగించే లెడ్ యాసిడ్ బ్యాటరీలను విక్రయిస్తుందని వాదించింది. ఈ సందర్భంగా కంపెనీ ఛైర్మన్ కవీందర్ ఖురానా మాట్లాడుతూ..తమ కంపెనీకి యూఎస్‌లో భాగస్వామ్య సంస్థ ఉందన్నారు. అయితే తాము ఎలాంటి ఈవీను తయారుచేయమని స్పష్టం చేశారు. ఈవీ మార్కెట్‌లోకి ప్రవేశించే ఉద్దేశం తమ కంపెనీకి లేదని ఖురానా చెప్పారు. తాము మరో సంస్థ ‘ఈ-అశ్వ’తో కలిసి ప్రకటన ఇచ్చినట్లు పేర్కొన్నారు. టెస్లా పవర్ బ్రాండెడ్ ఉత్పత్తుల విక్రయానికి ఈ కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందన్నారు.

## ఒకాయా సరికొత్త ఈ-బైకు

న్యూఢిల్లీ, మే 2: ప్రీమియం ఎలక్ట్రిక్ బైకుల తయారీ సంస్థ ఒకాయా.. దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. ‘డిస్రూప్టర్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.1.40 లక్షలుగా నిర్ణయించింది. (సబ్సిడీ చెల్లించిన తర్వాత). కేవలం కిలోమీటర్‌కు 25 పైసలు ఖర్చయ్యే ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 129 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఇందుకోసం సంస్థ 6.37 కిలోవాట్ల పవర్ బ్యాటరీని వినియోగించింది. ముందస్తుగా బుకింగ్ చేసుకున్న వెయ్యి మంది కస్టమర్లకు రూ.500 ప్రత్యేక ఆఫర్ అందిస్తున్నది. దీంతోపాటు ఫెర్రాటో మరో బైక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బైకు ధర రూ.1,59,999గా నిర్ణయించింది.





## ప్రముఖ టెక్ కంపెనీలో తొలగింపులు, బదిలీలు

ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని గూగుల్ ఉద్యోగుల తొలగింపులు, బదిలీలు చేపట్టింది. ఈ విషయాన్నికంపెనీ ప్రతినిధి తెలిపారు. తొలగింపులు కంపెనీ అంతటా ఉండవని, ప్రభావితమైన ఉద్యోగులు ఇతర అంతర్గత ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గూగుల్ ప్రతినిధి పేర్కొన్నారు. అయితే ప్రభావితమైన ఉద్యోగుల సంఖ్యను వెల్లడించలేదు. ప్రభావితమైన ఉద్యోగులలో కొంత మందిని భారత్, చికాగో, అట్లాంటా, డబ్లిన్ వంటి కంపెనీ పెట్టుబడులు పెడుతున్న కేంద్రాలకు బదిలీ చేయనున్నారు. గూగుల్ తొలగింపులతో ఈ సంవత్సరం టెక్, మీడియా పరిశ్రమలో మరిన్ని తొలగింపులు కొనసాగవచ్చనే భయాలు నెలకొన్నాయి. 2023 ద్వితీయార్థం నుంచి 2024 వరకు తమ అనేక బృందాలు మరింత సమర్థవంతంగా, మెరుగ్గా పని చేయడానికి, ఉత్పత్తి ప్రాధాన్యతలకు అనుగుణంగా మార్పులు చేసినట్లు గూగుల్ ప్రతినిధి పేర్కొన్నారు. బిజినెస్ ఇన్‌సైడర్ నివేదిక ప్రకారం.. లేఆఫ్‌లతో గూగుల్ రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ విభాగాలలోని అనేక మంది ఉద్యోగులు ప్రభావితమయ్యారు. ప్రభావితమైన ఫైనాన్స్ టీమ్‌లలో గూగుల్ ట్రెజరీ, వ్యాపార సేవలు, ఆదాయ నగదు కార్యకలాపాలు ఉన్నాయి. పునర్నిర్మాణంలో భాగంగా బెంగళూరు, మెక్సికో సిటీ, డబ్లిన్‌లకు వృద్ధిని విస్తరింపజేస్తామని గూగుల్ ఫైనాన్స్ చీఫ్, రూత్ పోరాట్ సిబ్బందికి ఈ-మెయిల్ పంపారు.




# సిటీ కార్డులు యాక్సిస్ బ్రాండ్‌కు

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ బ్రాండ్‌లోకి సిటీ బ్యాంక్ కస్టమర్ల కార్డుల మార్పు ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు సదరు ఖాతాదారులకు సందేశాలు వస్తున్నాయి. సిటీ బ్యాంక్ భారతీయ రిటైల్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సిటీ బ్రాండ్ కింద ఉన్న కార్డుల రీబ్రాండింగ్ జరుగుతున్నది. ఈ క్రమంలోనే తమ కొత్త ఐఎఫ్ఎస్‌సీని అప్‌డేట్ చేసుకోవాలని కార్డుదారులను యాక్సిస్ బ్యాంక్ కోరుతున్నది. కాగా, కార్డు బ్రాండ్ ఒక్కటే మారనున్నది. సిటీకి బదులు యాక్సిస్ అని వస్తుంది. దాని మీదున్న నంబర్లన్నీ అలాగే ఉండనున్నాయని గతంలోనే యాక్సిస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ చౌదరి చెప్పారు.

## యూపీఐ ఉన్నా నగదు ఉపసంహరణకే ప్రాధాన్యం

భారత్‌లో యూపీఐ చెల్లింపులు పెరుగుతున్నప్పటికీ గతేడాది ఏటీఎంల నుంచి చేసే నగదు ఉపసంహరణలు 5.51 శాతం పెరిగినట్లు తాజాగా సీఎంఎస్ నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి రేటు 9 శాతం పెరుగుతుందని అంచనాలు వెలువడుతున్నా ఆ మేరకు నగదు ఉపసంహరణ మాత్రం పెరగడంలేదని నివేదిక ద్వారా తెలిసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేసిన నగదు ఉపసంహరణల కంటే 2023-24లో చేసిన నెలవారీ విత్‌డ్రాలు సగటున 7.23 శాతం ఎక్కువగా ఉన్నాయి. గతేడాదిలో మెట్రోనగరాల్లో విత్‌డ్రా చేసిన సగటు నగదు అంతకుముందు ఏడాదికంటే 10.37 శాతం పెరిగింది. సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో 3.94 శాతం పెరుగుదల కనిపించింది.భారత్‌లో గతేడాది ఏటీఎంల ద్వారా అధికంగా డబ్బు తీసుకున్న ఉత్తరాది ప్రాంతాల్లో దిల్లీ, ఉత్తరప్రదేశ్‌లు ఉన్నాయి. దక్షిణాదిలో తమిళనాడు, కర్ణాటక ప్రజలు అధికంగా డబ్బు విత్‌డ్రా చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించి 49 శాతం ఏటీఎంలు మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో ఉండగా, 51 శాతం ఏటీఎంలు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను సగానికి తగ్గించిన ప్రభుత్వ సంస్థ ప్రైవేట్ రంగ బ్యాంకులకు సంబంధించి 64 శాతం ఏటీఎంలు మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. 36 శాతం ఏటీఎంలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లు తెలిసింది.



బాలనటిగా పలు మలయాళ, తమిళ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు అనిఖా సురేంద్రన్. 'బుట్ట బొమ్మ' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీ కి పరిచయమైంది. సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం అంతగా ఆకట్టుకోకపోవడంతో ఈ సినిమా వల్ల హీరోయిన్ గా ఆమెకు అంతగా ఉపయోగపడలేదు. అయితే ఆమె తమిళ, మలయాళంలో మాత్రం ఎదో ఒక సినిమా చేస్తూ ఆసక్తికరంగా వార్తల్లో నిలుస్తోంది. అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్', విశ్వాసం వంటి తమిళ చిత్రాలలో బాలనటి పాత్రలో అనిఖా మంచి పేరు సంపాదించుకుంది. 'నాన్ రౌడీ థాన్', 'మృధన్' వంటి చిత్రాల్లో కూడా ఆమె నటించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాలో తనకు వస్తున్న బ్యాడ్ కామెంట్స్ గురించి స్పందించింది.

# నేను కూడా మనిషినే..!

"చిత్రసీమలో ఇలాంటి విమర్శలు నటీమణులు పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్నారు. ఆకర్షణీయంగా దుస్తులు ధరించడం నా వ్యక్తిగత విషయం. నా స్టైలింగ్ నా ఇష్టం. విమర్శించారని... నా ఇష్టాన్ని పక్కన పెట్టలేను. ఈ విమర్శలు వస్తాయి.. పోతాయి. ఇవన్నీ జీవితంలో ఒక భాగం మాత్రమే. కామెంట్ చేయాలనే ఉద్దేశం ఉన్నవారు చీర కట్టుకున్నా కామెంట్స్ చేస్తారు. అయితే నా దుస్తుల విషయంలో కొందరు చేసే కామెంట్లు నన్ను చాలా ప్రభావితం చేస్తాయి. నేను కూడా మనిషినే. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తట్టుకోవడం కష్టంగా ఉంటుంది" అని అనిఖా ఎమోషనల్ అయింది.



## విజయ్ 'ది గోట్' నుంచి క్రేజీ అప్‌డేట్ షేర్ చేసిన దర్శకుడు

తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమాకు వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తుండగా.. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం, కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా తేదీని మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమాను సెప్టెంబర్ సెప్టెంబర్ 05న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇక ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి దర్శకుడు వెంకట్ ప్రభు సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు.

ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ పనుల కోసం హాలీవుడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి వీఎఫ్ఎక్స్ పనులు పూర్తయినట్లు దర్శకుడు వెంకట్ ప్రభు తెలిపారు. అలాగే ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర ఫొటోను కూడా షేర్ చేశారు. ఈ ఫొటోలో విజయ్ లుక్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. ఇక ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కల్పతి ఎస్ అఘోరం నిర్మిస్తున్నాడు. మీనాక్షి చౌదరి, వైభవ్, ప్రేమి అమరెన్, యుగేంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ప్రభాస్ 'బుజ్జి' వచ్చేసింది



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గత శుక్రవారం ఇన్‌స్టా వేదికగా ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. డార్లింగ్స్ త్వరలోనే మన లైఫ్‌లోకి ఓ కొత్త పర్సన్ రాబోతోన్నారు.. గుడ్ న్యూస్ వెయిట్ చేయండి అంటూ ప్రభాస్ ఓ పోస్ట్ వేశాడు. అయితే ఈ పోస్ట్ పెట్టగానే అభిమానులు అందరూ ప్రభాస్ పెళ్లి అనౌన్స్‌మెంట్ కావోచ్చని తెగ సంబరాలు చేసుకున్నారు. మరోవైపు ఈ పోస్ట్ సినిమా అప్‌డేట్ అవ్వోచ్చని కామెంట్లు వచ్చాయి. అయితే ఈ రూమర్స్‌కు చెక్ పెడుతూ 'కల్కి 2898 ఏడీ' సినిమా నుంచి బుజ్జి అనే పాత్రను రివీల్ చేయనున్నట్లు తెలిపాడు. ఇక చెప్పినట్లుగానే తాజాగా ఈ మూవీ నుంచి బుజ్జి అనే పాత్రను రివీల్ చేశాడు ప్రభాస్.

తాజాగా బుజ్జికి సంబంధించిన గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇక ఈ సినిమాలో బుజ్జి పాత్ర చిట్టి రోబో అని తెలుస్తుంది. బుజ్జి పేరుతో అందరూ దాన్ని పిలుస్తున్నారు. ఎవరా బుజ్జి అంటూ అంటూ వచ్చిన ఈ చిట్టి రోబోకు హీరోయిన్ కీర్తి సురేశ్? వాయిస్ ఓవర్? ఇచ్చింది. బుజ్జి మాటలు, బుజ్జి చేసే అల్లరి ఎంటర్‌టైనింగ్‌గా అనిపించాయి. ఇక గ్లింప్స్ చివరిలో 'నా లైఫ్ ఎంటి? బాడీ లేకుండా బతికేయాల్సిందేనా' అంటూ చెబుతుండగా.. ప్రభాస్ వచ్చి 'నీ టైమ్ మొదలైంది బుజ్జి' అంటూ ఒక స్పెషల్ కారును రివీల్ చేయబోయాడు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఇస్తూ బుజ్జి గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే మే 22 వరకు వెయిట్ చేయాల్సిందేనని చిత్రయూనిట్ తెలిపారు. మహానటి దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో దీపిక, దిశా పటానీ హీరోయిన్లు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 27న సినిమా విడుదల కానుంది.

## జూలైలో భారతీయుడు - 2



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం ' భారతీయుడు 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో 1996లో విడుదలైన బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన 'ఇండియన్' చిత్రాన్ని 'భారతీయుడు'గా విడుదల చేసింది. ఆ మూవీకి సీక్వెల్‌గా ఇప్పుడు ' భారతీయుడు 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే . భారతీయుడు సీక్వెల్ అంటే ఎలాంటి అంచనాలుంటాయో వాటిని మించేలా డైరెక్టర్ శంకర్ భారతీయుడు 2ను విజువల్ వండర్‌గా ఆవిష్కరిస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా కమల్ హాసన్ పవర్‌ఫుల్ పెర్ఫామెన్స్ ఇవ్వటానికి రెడీ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. జూలైలో సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.



## దేవర నుంచి ఫస్ట్ సాంగ్ వచ్చేసింది..!

యంగ్ టైగర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ దేవర. పాన్ ఇండియా స్థాయిలో మూవీ తెరకెక్కుతున్నది. ఈ మూవీపై అభిమానుల్లో భారీగా అంచనాలున్నాయి. దాదాపు రూ.300 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ నటిస్తున్నది. ఇక సీనియర్ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు.

ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా అభిమానులకు కానుకగా దేవర మూవీ నుంచి ఫస్ట్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఫియర్' సాంగ్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. ఇందులో ప్రతి పదం గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నది. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్‌ను ఇరగదీశారు. ఇదిలా ఉండగా.. దేవర మూవీ రెండు భాగాలుగా తెరకెక్కుతున్నది. దేవర తొలి భాగంగా ఈ ఏడాది అక్టోబర్ 10న దసరా కానుకగా విడుదల కానున్నది.



## 2025 సంక్రాంతికి 'గుడ్ బ్యాడ్ అగ్లీ' విడుదల



తమిళ స్టార్ అజిత్ కుమార్‌తో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బిగ్గెస్ట్ ఎంటర్ టైనర్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఇటివలే హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఫ్యాన్స్‌కి బిగ్ సర్ ప్రైజ్ ఇచ్చారు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. టైటిల్ కి తగ్గట్టు అజిత్ ని మూడు డిఫరెంట్ వేరియేషన్స్ లో పవర్ ఫుల్ గా ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఫస్ట్ లుక్ లో వైబ్రెంట్ అవుట్ ఫిట్స్, చేతినిండా టాటూస్, షేడ్స్ ధరించి ఎదురుగా వున్న వెపన్స్ తో అమేజింగ్ గా కనిపించారు అజిత్.

మూడు లుక్స్‌లో మూడు డిఫరెంట్ వేరియేషన్స్‌తో మెస్మరైజ్ చేశారు. సినిమాపై చాలా క్యూరియాసిటీ పెంచిన ఈ పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా రూపొందనున్న ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. అభినందన్ రామానుజం డీవోపీగా పని చేస్తుండడగా, విజయ్ వేలుకుట్టి ఎడిటర్ గా పని చేస్తున్నారు. 2025 సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది.